ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి




ఖమ్మం

శుక్రవారం ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 31 । కనిష్ఠం 19 | భద్రాద్రి : గరిష్ఠం 30 । కనిష్ఠం 19 ◆ శనివారం, 13 జనవరి 2024

పత్తి విపత్తు!

- ప్రకృతి వైపరీత్యాలతో పంటను ముసిరిన తెగుళ్లు
- భారీగా పడిపోయిన దిగుబడులు
- నాణ్యతాలోపంతో మార్కెట్‌లో దక్కని 'మద్దతు'
- అడుగంటిన అన్నదాతల ఆశలు
- నాలుగు నెలలు ముందుగానే పంట తొలగింపు
- ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు



జూలూరుపాడు, జనవరి 12: వానాకాలం వ్యవసాయ సీజన్‌లో రైతులని ప్రకృతి వైపరీత్యాలు దెబ్బమీద దెబ్బ కొట్టాయి. ఈ సీజన్‌లో వర్షాలు ముఖం చాటేయడంతో పత్తిపంటపై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. సీజన్ ప్రారంభంలో అనావృష్టి పత్తి పంటను దెబ్బతీయగా నవంబరులో వచ్చిన మించౌగ్ తుఫాన్ పంటను నిండా ముంచేసింది. ప్రకృతి వైపరీత్యానికి తెల్ల బంగారం రైతు చిత్తయ్యాడు. గత ఏడాది పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధిక ధర లభించడంతో మంచి లాభాలు గడించిన రైతులు ఈ ఏడాది కూడా ఆశాజనకంగా ఉంటుందని రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలు వారి ఆశలను అడియాశలు చేశాయి. భద్రాద్రి జిల్లాలో ఈ సంవత్సరం 1.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేపట్టారు. గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గడంతో మంచి ధర లభిస్తుందని రైతులు ఆశపడ్డారు. పత్తిపంట సాగు ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో మొక్కల్లో ఎదుగుదల నిలిచిపోయింది. ఈ ప్రభావం దిగుబడులపై గణనీయంగా పడింది. అడపాదడపా కురిసిన వర్షాలతో చేతికొచ్చిన కొద్ది పాటి పంటను దక్కించుకుని సొమ్ము చేసుకోవాలన్న రైతుల ఆశలను చివరిలో మించౌగ్ తుఫాన్ రూపంలో మరోసారి దురదృష్టం వెంటాడింది. దీంతో చేతికి వచ్చిన పంట చేలోనే పాడైపోయింది. వర్షానికి పత్తి తడిచిపోవడంతో నేలరాలి నల్లబారింది. కాయల్లోకి నీరు చేరడంతో పుచ్చువచ్చింది. అంతేకాకుండా పంట ఎర్రబారిపోయాయి. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



వెంగన్నపాలెంలో పత్తిని తొలగించి మొక్కజొన్న సాగు చేసిన దృశ్యం

పెట్టుబడి వృథా.. రైతుకి వ్యథ

పత్తి రైతులు ఎకరానికి రూ.50వేల నుంచి రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టారు. కాగా వాతావరణ పరిస్థితి వల్ల ఎకరానికి 5నుంచి 6క్వింటాల్లోపే దిగుబడులు వచ్చాయి. దీనికి తోడు పంటలో నాణ్యత లోపించడంతో మార్కెట్‌లో క్వింటాకు రూ.5,800 నుంచి రూ.6,500 మాత్రమే ధర లభిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం తెల్లబంగారానికి రూ.7,200 మద్దతు ధర ప్రకటించినా ఈ సీజన్‌లో మార్కెట్‌లో రైతులు ఆ మద్దతు ధర లభించిన దాఖలాలు లేవు. చేతికొచ్చిన కొద్దిపాటి పంటను విక్రయించినా పెట్టుబడులు కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేలకు నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు

పత్తి పంటతో తీవ్రంగా దెబ్బతిన్న రైతులు డిసెంబరు, జనవరిలో ఆ పంటను పూర్తిగా దున్నేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగును చేపట్టారు. ఇప్పటికే జిల్లాలోని జూలూరుపాడు, సుజాతనగర్, పాల్వంచ, టేకులపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి వంటి మండలాల్లో పత్తి పంట తొలగించి రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. మరి కొందరు రైతులు ఈ దిశగా అడుగులు వేస్తుండడంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పత్తిసాగు ద్వారా నష్టపోయినా మొక్కజొన్న పంటైనా కాస్త ఆసరకొస్తుందని ఆశ రైతుల్లో నెలకొంది.

గ్రంథాలయం
కుప్పకూలింది

- నేలమట్టమైన 73 ఏళ్లనాటి భవనం
- శుక్రవారం సెలవు కావటంతో తప్పిన ప్రాణ నష్టం



కూలిన జిల్లా గ్రంథాలయ రీడింగ్ హాల్ భవనం



కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 12: అది ఖమ్మం నగరం నడిబొడ్డున పాతబస్టాండ్ సమీపంలోని పెవిలియన్‌గ్రౌండ్ వద్ద 73ఏళ్ల క్రితం నిర్మించిన ఆ గ్రంథాలయ భవనం. ఒకప్పుడు వందలాది పుస్తకాలు, దినపత్రికలు చదివేందుకు వినియోగించిన ఆ భవనం కాలక్రమేణ రీడింగ్‌హాలుగా మారింది. గ్రంథాలయ కార్యాలయం, పుస్తకాల కోసం కొత్తభవనాన్ని నిర్మించిన క్రమంలో అధికారులు.. 1950లో నిర్మించిన ఆ భవనాన్ని రీడింగ్‌హాలుగా మార్చారు. దీంతో ఆ రీడింగ్‌హాలులో నిత్యం సుమారు 80 మంది వరకు నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమవుతుంటారు. ఆ భవనం శుక్రవారం ఉదయం కుప్పకూలింది. ప్రతీ శుక్రవారం సెలవు దినం కావడంతో అక్కడకు చదువుకునేందుకు ఎవరూ రాకపోవడంతో భారీ ప్రమాదమే తప్పింది. అయితే ఉదయం స్వీపర్ రీడింగ్ హాలు భవనాన్ని ఊడ్చి పక్కనే ఉన్న కార్యాలయ భవనంలోకి వెళ్లిన తర్వాత ఉదయం 8:30గంటలకు రీడింగ్‌రూం ఉన్న భవనం కుప్పకూలిపోవడంతో భవనంలో ఎవరైనా ఉన్నారేమోనని ఆందోళనకు గురయ్యారు. అయితే శుక్రవారం సెలవు కావడం, ఊడ్చేందుకు వెళ్లిన స్వీపర్ నాగమ్మ క్షేమంగానే ఉండటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ప్రత్యక్ష సాక్షి నాగమ్మ చెప్పిన వివరాలివీ..

ఈ గ్రంథాలయంలో ఎన్నో ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ స్వీపర్‌గా పని చేస్తున్నానని, రోజూల లాగే ఉదయం 7:30గంటలకే వచ్చి మొదట వెనుక భాగంలో ఉన్న రీడింగ్ రూములను శుభ్రం చేశానని, 8గంటలకు అధికారుల గదులను శుభ్రం చేసేందుకు వెళ్లానని, ఈ లోపే పెద్ద శబ్దం వచ్చిందని నాగమ్మ చెప్పింది. భవనం కుప్ప కూలటం చూసి తన ప్రాణాలు పోయినంత పనయిందని, తేరుకుని వెంటనే అధికారులకు సమాచారమిచ్చానని తెలిపింది.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

ఈ భవనం శిథిలావస్థకు చేరిన విషయం గతంలో గ్రంథాలయ చైర్మన్లుగా పనిచేసిన వారికి తెలిసినా ఏం మార్చలేకపోయారని, మూడేళ్ళుగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగానే ఉందని పాఠకులు, స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రంథాలయ సంస్థల పాత చైర్మన్లను తొలగించడంతో ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నియమితులయ్యారు. ఆయన రెండు రోజుల క్రితం ఈ గ్రంథాలయానికి వచ్చి భవనాన్ని త్వరగా ఖాళీ చేయించాలని అధికారులకు సూచించినా అధికారులు వినలేదని, ఈ లోపు భవనం కూలిందని, శుక్రవారం సెలవు కావడంతో ప్రాణనష్టం తప్పిందని, లేదంటే ఎన్ని ప్రాణాలు పోయేవోనని పలువురు పేర్కొంటున్నారు.

ఉద్యోగులపై మంత్రి ఆగ్రహం

శిథిలావస్థలో ఉన్న భవనంలో గ్రంథాలయాన్ని ఎలా నిర్వహిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథాలయ భవనం కూలిన విషయం తెలుసుకుని వ్యవసాయ మార్కెట్ నుంచి అక్కడికి చేరుకున్న ఆయన ఘటనపై ఆరా తీశారు. శిథిలాలను వెంటనే తొలగించాలని, ఐదు రోజుల్లో అంతా సర్దుబాటు చేయాలని, అప్పటి వరకు నగరంలోని పాత కార్పొరేషన్ కార్యాలయంలోని సిటీ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కూలిన భవనం పక్కనే ఉన్న మరో భవనాన్ని కూడా పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి ఈ ఘటనలో ఉద్యోగుల నిర్లక్ష్యం ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి తుమ్మల ఆదేశాలతో నూతన భవన నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తామని, ఇక్కడ పరిస్థితి మెరుగయ్యేవరకు సిటీగ్రంథాలయంలో తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఈఈలు కృష్ణలాల్, నాగేశు, టౌన్ ఏసీపీ హరికృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి ముంజువాణి, తదితరులున్నారు.

గ్రంథాలయంతో సాహిత్యానుబంధం

ఖమ్మం, సాంస్కృతికం : జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం కూలిందన్న సమాచారం తెలిసి ఉమ్మడి జిల్లాలోని సాహిత్య అభిమానులు, కవులు, కథారచయితలు దిగ్భ్రాంతికి గురయ్యారు. దశాబ్దాల తరబడి తమకున్న సాహిత్యానుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలు సాహితీ కార్యక్రమాలకు వేదికైన ఈ గ్రంథాలయంతో దాశరథి కృష్ణమాచార్య, రంగాచార్య, రావెళ్ల వెంకటరామారావు, చేకూరి రామారావు, కవి రాజమూర్తి, హీరాలాల్ మోరియా, అంకిత కేశవులు, కౌముది, కావూరి పాపయ్య శాస్త్రి, పొత్తూరి సుబ్బారావు, చావా శివకోటి, తదితర ఎందరో దివంగత సీనియర్లతో పాటు ప్రస్తుత కవులు, రచయితలు ఈ గ్రంథాలయంతో విడదీయలేని సాహిత్య అనుబంధం కలిగి ఉన్నారు. అలాగే కూలిన భవనంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు నుంచి ఎందరో కవులు, రచయితల ఫొటోలు ఉండగా.. అవన్నీ భవనం కూలడంతో ధ్వంసమయ్యాయి.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ, తదితరులు

ఇల్లెందు పురపాలకంలో
మళ్లీ అవిశ్వాస వేడి

- చైర్మన్‌కు వ్యతిరేకంగా 19మంది కౌన్సిలర్ల సంతకాలు
- కలెక్టర్‌కు ఫామ్-1 అందజేత



అవిశ్వాసం ప్రకటిస్తూ ఫామ్ 1ను కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

ఇల్లెందు, జనవరి 12: ఇల్లెందు మునిసిపాలిటీలో మరోసారి అవిశ్వాస తీర్మాన అంశం తెరపైకి వచ్చింది. రెండేళ్లుగా చైర్మన్‌గా ఉన్న దమ్మాలపటి వెంకటేశ్వరరావుపై మెజార్టీ కౌన్సిలర్లు పలు విమర్శలు చేయడం, ఇప్పటికే మూడు సార్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు తీర్మానాలు అందించగా.. పలు కారణాలతో ఆ వేడి చల్లారింది. కానీ ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్లపై అవిశ్వాస నోటీసులు అందజేస్తున్న క్రమంలో మళ్లీ ఇల్లెందులోని చైర్మన్‌ను వ్యతిరేకిస్తున్న కౌన్సిలర్లు ఆయనపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఫామ్1ను కలెక్టర్‌కు అందజేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇల్లెందు మున్సిపల్ చైర్మన్, నాటి ఎమ్మెల్యే హరిప్రియ మధ్య బేధాభిప్రాయాలు రెట్టింపైంది. ఆ సమయంలో మున్సిపల్ చైర్మన్ డీవీ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాడు ఆయన వెంట ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే వెళ్లారు. దీంతో చైర్మన్ను ఎలాగయినా గద్దె దించాలన్న పట్టుదలతో మిగిలిన 19మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరతీసి.. గురువారం సాయంత్రం కలెక్టర్ ప్రియాంక అలా కు ఫారం-1 నమూనాలో నోటీసు అందజేశారు. గత రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల మేరకు ప్రస్తుత జనవరితో పదవీకాలం నాలుగేళ్ల పూర్తవుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అవిశ్వాసాల ఊపు కనిపిస్తోంది. అంతేకాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరధిలో అవిశ్వాస పరంపర జరగుతుండగా.. కొందరు స్వచ్ఛందంగానే వైదొలుగుతున్నారు. ఈ క్రమంలో ఇల్లెందు మునిసిపాలిటీలో కాంగ్రెస్‌లో చేరిన చైర్మన్ డీవీపై ఇచ్చిన అవిశ్వాసం రాజకీయ చర్చకు దారితీసింది.

రైతుల విషయంలో రాజీపడం

- పంట ధరలపై నిరంతర పర్యవేక్షణ
- కావాలని ధరలు తగ్గించే వ్యాపారులను ఉపేక్షించం
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సందర్శనలో మంత్రి తుమ్మల



రైతుతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమార్కెట్, జనవరి 12: రైతుల సంక్షేమం, వారు పండించే పంటల ధరల విషయంలో తాము రాజీ పడేది లేదని, మార్కెట్‌లో కావాలని ధరలు తగ్గించే వ్యాపాలను ఉపేక్షించేది లేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఖమ్మం వ్యవసాయమార్కెట్ లోని మిర్చి యార్డును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లో మిర్చికి పెడుతున్న ధరల గురించి ఆరా తీసిన ఆయన ఎక్కువ రేటుకు తక్కువలాట్లు.. తక్కువరేటుకు ఎక్కువలాట్లు కొనడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. కొన్నిరోజులుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు ఎందుకు తగ్గుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. అయితే క్వింటాకు గతంలో రూ.23వేలకు పైగా చెల్లించేవారని ఇప్పుడు రూ.18వేల వరకే ఇస్తున్నారని కొందరు రైతులకు ఆయనకు వివరించారు. ఇప్పటికే వానలు, చీడపీడలతో మిర్చితోటలు దెబ్బతిన్నాయని, ధర తగ్గితే నష్టాలు చూస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి తుమ్మల కావాలని ధరలు తగ్గిస్తే ఊరుకునేది లేదని, వ్యాపారులు మిర్చి ధరను తగ్గించకుండా అధికారులు ఎప్పటికప్పుడు చూసుకోవాలని ఆదేశించారు. మిర్చి ధరలు పడిపోకుండా ప్రభుత్వం అన్నివిధాల చర్యలు తీసుకుంటుందని భరోసానిచ్చారు. అయితే రూ.20వేల ధర చొప్పున 34లాట్లు కొనడం, రూ.17వేల చొప్పున 393లాట్లు కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన తుమ్మల.. కొర్రీలు పెట్టి ఇలా రైతును నష్టపరచడం భావ్యం కాదని, రేటులో ఇంత వ్యత్యాసం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పంటలకు న్యాయమైన ధరను అందించేందుకు తాము నిరంతర పర్యవేక్షణ చేస్తామని, అధికారులు కూడా నాణ్యతను సక్రమంగా తనిఖీ చేయాలని, మార్కెట్‌కు వచ్చే పంటలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనంతరం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇతర అధికారులు, వ్యాపారులతో సమీక్ష నిర్వహించారు. నాణ్యతతో కూడిన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని, మిర్చి నాణ్యతను పరిశీలించే యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందనిన్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మాట్లాడుతూ ఇటీవల మిచౌంగ్ తుఫాన్ కారణంగా మిర్చి నాణ్యత దెబ్బతిన్నదని అందువల్ల ధరలు కొంత మేర తగ్గాయని, మార్కెట్లలో రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వ్యాపారులపై దృష్టి పెడతామని, కావాలని ధరలు తగ్గించి రైతులను నష్ట పరచాలని చూస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాసరావు, వరంగల్ డీడీ అజ్మీరా రాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం ఏ అలీం, మార్కెట్ ఇంచార్జి సెక్రెటరీ బజారు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పలువురు అధికారులున్నారు. అనంతరం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెటింగ్ శాఖ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యార్డుల్లో వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే మార్కెట్ సెక్రెటరీ, సిబ్బందిని నియమించి ఎలాంటి ఆటంకాలు లేకుండా మార్కెట్ కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

తవ్వకాలపై
అధికారుల నజర్

- జిల్లాలోని పలు క్వారీల పరిశీలన
- పలుచోట్ల సరిహద్దుల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి తుమ్మల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఖమ్మం, జనవరి 12(ఆంధ్రజ్యోతిప్రతినిధి): గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇష్టానుసారం గా గుట్టల్లో గ్రావెల్, గ్రానైట్, మెటల్, ఇసుక తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై మైనింగ్, రెవెన్యూ, పోలీసు తదితర యంత్రాంగాలు దృష్టి సారించాయి. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో శుక్రవారం జిల్లాలో పలుచోట్ల మైనింగ్ తవ్వకాలపైనా త నిఖీలు సాగించారు. రఘునాథపాలెం, ఏన్కూరు, తల్లాడ, జూలూరుపాడుతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇసుక, మెటల్, గ్రావెల్ క్వారీలు, గుట్టల్లో జరిగిన తవ్వకాలపై ప్రస్తుతం దొంగచాటుగా జరుగుతున్న తవ్వకాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మైనింగ్ అక్రమాలు, లీజు క్వారీల సరిహద్దులను కూడా గుర్తిస్తున్నారు. అనుమతులు తీసుకున్నది ఎంత? తవ్వకాలు జరిపింది ఎంత? అన్నదానిపై కూడా పరిశీలన సాగిస్తున్నారు. అక్రమాలు తేలితే లీజు యజమానులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

'సీతమ్మసాగర్'పై నీలినీడలు

- పర్యావరణ అనుమతులు లేకుండానే పనుల ప్రారంభంతో ఇబ్బందులు
- ప్రాజెక్టు సీఈపై చర్యలకు కేంద్రం ఆదేశాలతో మరింత సందిగ్ధం

సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణపనుల దృశ్యం



అశ్వాపురం, జనవరి 12: బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా గత ప్రభుత్వం అశ్వాపురం మండలపరిధిలోని కుమ్మరిగూడెం వద్ద దుమ్ముగూడెం ఆనకట్టకు సమాంతరంగా రూ.3,480కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణపనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు కేంద్ర ప్రభుత్వంనుంచి ఎలాంటి పర్యావరణ అనుమతులు పొందకుండా సంబంధిత అధికారులు పనులు చేపట్టడం ఇబ్బందులు తెచ్చిపెట్టింది. తాజాగా ఈ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు సంబంధిత ప్రాజెక్టు సీఈ శ్రీనివాసరెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర అటవీ, పర్యావరణశాఖ, రాష్ట్ర నీటిపారుదలశాఖకు ఉత్తర్వులు జారీ చేయటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని సుమారు 6లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రూ.13వేల కోట్ల వ్యయంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు ఊతంగా సీతమ్మసాగర్‌ను చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టునిర్మాణం సందర్భంగా స్థానికంగా గ్రామసభలు ఆమోదం తెలపకుండా, నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా, పర్యావరణ అనుమతులు పొందకుండా పనులు చేపట్టారని ఆరోపిస్తూ దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన తెల్లం నరేష్, బూర లక్ష్మీనారాయణ అనే నిర్వాసిత రైతులు 2022 మార్చిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో ఎన్‌జీటీ ప్రాజెక్టు పనులపై స్టే విధించింది. అయినా అధికారులు పనులు కొనసాగించటంతో మరోమారు నిర్వాసిత రైతులు ఎన్‌జీటీని ఆశ్రయించారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఎన్‌జీటీ ద్విసభ్య కమిటీని నియమించింది. దీంతో ఎన్‌జీటీకి చెందిన డైరెక్టర్ తరుణ్, గోదావరి నదీ నిర్వహణకమిటీ సభ్యుడు ప్రసాద్ నేతృత్వంలోని ద్విసభ్య కమిటీ గతేడాది జూన్ 28న ప్రాజెక్టును సందర్శించింది. అనంతరం ప్రభుత్వం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీంతో ద్విసభ్య కమిటీ పూర్తి వివరాలతో కేంద్ర పర్యావరణ శాఖ, ఎన్‌జీటీకి నిబంధనల ఉల్లంఘనలపై పూర్తిస్థాయి నివేదిక అందజేసింది. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని నివేదిక ఇవ్వడంతో కేంద్రం తాజా చర్యలకు ఉపక్రమించింది.



కూడార్ై ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తి ప్రపత్తులతో కూడారై ఉత్సవం

భద్రాద్రి రామాలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు

భద్రాచలం, జనవరి 12: ధనుర్మాస మహోత్సవాల్లో 27వ రోజైన శుక్రవారం భద్రాద్రి రామాలయంలో కూడారై ఉత్సవాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. రామాలయ ప్రాంగణంలో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుప్పావై, తిరుపళ్లెచ్చి అను ద్రవిడ ప్రబంధాలను నివేదన సమయంలో అనుసంధానం చేశారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుడితో తన వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్నం నివేదన చేస్తానని సుందర బాహుస్వామికి మొక్కుకుంటుంది.ఈ సమయంలో అమ్మవారితో శ్రీరంగనాథుని కల్యాణం జరగడం,ఆయనలో ఐక్యం అవడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా ధనుర్మాస మహోత్సవాల సమయంలో కూడారై ఉత్సవాన్ని అమ్మవారిని స్మరించుకుంటూ రామాలయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సమయంలో మహిళా ముత్తైదువులకు గోదాదేవి ప్రతిమలను ఇచ్చి షోడషోపచారాలతో శ్రీకృష్ణ, గోదా అష్టోత్తరాన్ని భక్తి ప్రపత్తులతో పఠించారు. చివరగా కూడారై అనే పాశురాన్ని నక్షత్రహారతితో నీరాజనం ఇస్తుండగా పఠించారు. కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కేశవ స్థలశాయి, ఉపప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమచార్యులు, కోటి శ్రీమన్నారాయణచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి మాఫియా



» గార్లొడ్డు గుట్టలను చెరబడుతున్న అక్రమార్కులు
» ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో అడ్డగోలుగా మట్టి తరలింపు



మట్టి తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

ఏన్కూరు, జనవరి 12: ఏన్కూరు మండలంలోని గార్లొడ్డు గుట్టలు కరిగిపోతున్నాయి. అక్రమార్కుల మట్టి దోపిడీతో కుంగిపోతున్నాయి. కోట్ల విలువన మట్టి తరలిపోవ డంతో గుట్టలు నామరూపాల్లేకుండా పోతున్నాయి. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు నిషేధం ఉన్నా కొన్నేళ్ల నుంచి యథేచ్చగా అక్రమ తవ్వకాలు కొనసాగడం విశేషం. గార్లొడ్డుతోపాటు నరసింహారావుపేట, జన్నారం ప్రాంతాల్లో గుట్టలు విస్తరించి ఉన్నాయి. ఈగుట్టల నుండి రాత్రివేళలలో అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ రోడ్డు పనులు చేస్తున్న ఇక్కడ నుంచే మట్టిని లారీల ద్వారా తరలించి అక్రమార్కులు కోట్లు సంపాదిస్తున్నారు. వీటి శబ్దం వల్ల ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హరిత ట్రిబ్యునల్‌కు స్థానికుల ఫిర్యాదు

గుట్టలు తరగిపోయి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని హరిత ట్రిబ్యునల్ కు కొంతమంది ఫిర్యాదు చేశారు. గత ఏడాదిన్నర క్రితం హరిత ట్రిబ్యునల్ బృందం ఈప్రాంతంలో పర్యటించి స్థానికులును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోజురోజుకి తవ్వకాలు ఎక్కువగా అవ్వడంతో రెండు రోజుల నుంచి అధికారులు తవ్వకాలపై నిఘాపెట్టారు. శుక్రవారం తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు ఎస్ఐ బాదావత్ రవి గుట్టలను పరిశీలించారు. ఆ సమ యంలో మనుషులు, వాహనాలు లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం జేసీబీ, ట్రాక్టర్ ఓనర్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఇక నుంచి గుట్టల్లో మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీ ల్దార్ హెచ్చరించారు. దీనిపై నిరంతరం నిఘాపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రతిరోజు పోలీసుకలు ఆదేశించారు. ఈ అక్రమ మట్టి వ్యాపారం బీఆర్ఎస్ ప్రభుత్వంలో యదేచ్ఛగా సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దీనికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోరం కనకయ్య సన్మాన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సమష్టి కృషితో జిల్లా సమగ్రాభివృద్ధి

భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం టౌన్, జనవరి 12: జిల్లాను అభివృద్ధిపథంలో నడిపేందుకు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషి జరపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రి యాంక అల అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికి అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్‌గా పని చేసిన కోరం కనకయ్య ఆత్మీయ సమవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన కోరం కనకయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికకావడం అభినందనీయమన్నారు. గ్రామీణప్రాంత ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న కనకయ్య లాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ నేపధ్యం లేకుండా నిరుపేద కుటుంబం నుంచి వచ్చి తాను ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించేందుకు నిధులను మంజూరు చేయిస్తానన్నారు. కో ఆపరేటివ్ డైరెక్టర్‌గా మార్కెట్ కమిటీతోపాటు జడ్పీటీసీగా, జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పని చేశానని, ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసే నాయకుల్లో కనకయ్య అగ్రగామిగా ఉంటారని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసుదన్‌రాజు, జడ్పీ సీఈవో విద్యాలత, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, డీపీఆర్వో శీలం శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి విజేత, అధికారులు భీమ్లానాయక్, వెంకటేశ్వర్లు, జడ్పీటీసీలు పోశం నర్సింహారావు, పైడి వెంకటేశ్వర్లు, బరపటి వాసుదేవరావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావుతోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం కోరం కనకయ్య దంపతులను సత్కరించారు.

డివైడర్ దాటుతుండగా ఢీకొట్టిన లారీ

» అక్కడికక్కడే వ్యక్తి దుర్మరణం » కొత్తగూడెంలో ఘటన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 12: డివైడర్ దాటుతుండగా లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వైపు ఎత్తుగాఉన్న డివైడర్ ఎక్కి చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి మాచినేని తరుణ్(35) దిగుతున్నాడు. ఈ క్రమంలో బొగ్గు లోడుతో లారీ సత్తుపల్లి నుంచి పాల్వంచ వైపు వెళ్తుండగా అతన్ని ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తి లారీ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలంలోకి పోలీసులు చేరుకొని ఆ దేహాన్ని స్థానికుల సహాయంతో పోలీసులు బయటకు తీశారు. లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

‘జడ్పీ’ పనులు నిలిపివేయమన్నారా?

» అసంపూర్తిగా మిగిలిన అంగన్వాడీ భవనాలకు ప్రాధాన్యమివ్వండి
» ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశంలో పలువురు సభ్యుల ఆవేదన



ఖమ్మం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 12: ‘జిల్లా పరిషత్‌కు.. జడ్పీటీసీ సభ్యులకు ఇంకా కాలపరిమితి ఉంది... జడ్పీ నిధులతో నిర్వహించే పనులను నిలిపివేయమని ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? మండలాల్లో ఆ నిధులతో చేపట్టే పనులను నిలిపివేయాలంటూ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారంటూ...?’ పలువురు జడ్పీటీసీలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖలపై చర్చకు అజెండా గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి పై చర్చ సందర్భంగా పెనుబల్లి జడ్పీటీసీ సభ్యులు చక్కిలాల మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి విడుదలైన పనులను నిలిపివేయాలంటూ మండల ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారని దీనిపై ప్రభుత్వం ఏమైనా ఆదేశాలు జారీ చేసిందా? లేకుంటే ఇంజనీరింగ్ అధికారులే కావాలని నిలిపివేస్తున్నారా అంటూ ప్రశ్నించారు.

జడ్పీ నుంచి ఐదు లక్షల లోపే నిధులుంటాయి

దీనికి స్పందించిన జడ్పీ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజ్ కల్పించుకుని వాస్తవానికి జడ్పీ నుంచి వచ్చే నిధులు కేవలం రూ 5లక్షల లోపే ఉంటాయని అలాంటి వాటిని నిలిపి వేసే ఆస్కారం లేదని చెప్పారు. దీనిపై పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రమౌళి సమాధానం చెబుతూ ప్రభుత్వం నుంచి అలాంటి ఆదేశాలు ఏమీ రాలేదని , జడ్పీ అధికారులు కానీ తాను కానీ ఈ పనులను నిలిపివేయమంటూ ఎవ్వరికీ ఆదేశాలు జారీ చేయలేదన్నారు. ప్రస్తుతం నడుస్తున్న పనులు ఏంటి, ఇంకా ప్రారంభం కానీ పనులున్నాయా.. వాటి పరిస్థితిని గురించి అడిగామే తప్ప నిలిపివేయమని చెప్పలేదంటూ ఆయన సమాధానం చెప్పా రు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రతిపా దనలు సిద్ధం చేయాలని దీనికి ప్రజాప్రతినిధులు కూడా సహకారాన్ని ఇవ్వాలంటూ డీఆర్డీవో విద్యాచందన చెప్పగా... గతంలో తుమ్మల నాగేశ్వరరావు శిశుసంక్షేమశాఖ మంత్రిగా ఉన్న సమయంలో సత్తుపల్లితో పాటు ఇతర నియోజకవర్గాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు రూ 7 లక్షల చొప్పున నిధులు విడుదల చేశారని తర్వాత రూ 5 లక్షలకే బిల్లులు చేశారని దీంతో 70 నుంచి 80 అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని పెనుబల్లి జడ్పీటీసీ మోహన్‌రావు అన్నారు. ఇలా నిలిచి పోయిన భవనాలకు ప్రాధాన్యం కల్పించాలని ఆయన కోరారు.

బోర్లకు అనుమతులు ఇవ్వడం లేదు

ఆర్వోఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చిన భూముల్లో గిరివికాసం కింద బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారంటూ కొణిజర్ల జడ్పీటీసీ పోట్ల కవిత అన్నారు. దీనికి ఫారెస్ట్ అధికారి బాబు, డీఆర్డీవో మాట్లాడుతూ వాస్తవానికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలున్న వారికి పీసీసీఎం అనుమతికి పంపించామని అక్కడినుంచి అనుమతులు వస్తే బోర్లు, విద్యుత్ సౌకర్యానికి అవకాశం కలుగుతుందన్నారు. సింగరేణి జడ్పీటీసీ జగన్ మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులకు బోర్ల విషయంలో కొర్రీలు పెడుతున్న ఫారెస్ట్ అధికారులు, కొంత మంది డబ్బులు ఇచ్చిన రైతులకు మాత్రం అనుమతులు ఎలా ఇస్తున్నారంటూ నిలదీశారు.

రైతుబంధుపై స్పష్టత ఇవ్వండి

అంతకు ముందు వ్యవసాయశాఖ పై జరిగిన చర్చ సందర్భంగా జిల్లాలో రైతులకు రైతుబంధు కింద నగదు జమ కావడం లేదని సింగరేణి జడ్పీటీసీ జగన్ అన్నారు. ఈ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడించాలని ఆయన కోరారు. రైతు బంధును కొనసాగిస్తున్నారా లేదా దీనిపై కూడా పలు అనుమానాలు ఉన్నాయని కారేపల్లి జడ్పీటీసీ జగన్‌తో పాటు చింతకాని జడ్పీటీసీ తిరుపతిరావు ప్రశ్నించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ముగింపు కు వచ్చాయని ప్రభుత్వం వరికి రూ 500 బోనస్‌ను ఇస్తామని ప్రకటిస్తోందని . అయితే జిల్లాలో వరిధాన్యాన్ని పండించి ప్రైవేటుకు, ప్రభుత్వానికి అమ్మిన ప్రతి రైతుకు కూడా రూ 500 బోనస్‌ను వర్తింప చేయాలంటూ ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు కోరారు. దీనికి జడ్పీ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజ్‌కూడా గొంతుకలిపి సోయింగ్ ప్రకారం అందరు రైతులకు బోనస్‌ను ఇవ్వాలని కోరారు. గౌరారం గ్రామపంచాయతీలో పంట నమోదు ను వ్యవసాయశాఖ అధికారులు సక్రమంగా చేయకపోవడం వలన పత్తి రైతులు విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారంటూ పెనుబల్లి జడ్పీటీసీ మోహన్‌రావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు అవసరమైన జిప్సం, జీలుగులు ఏప్రిల్ నాటికి సిద్ధంగా ఉంచాలని ఈ ఏడాది రైతులు డిమాండ్ చేసే ట్రైకోడెర్మా విరిడి మందులను కూడా అందుబాటులో ఉంచాలని తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టారాగమయి, బానోతు రాందాస్ జడ్పీ సీఈవో వింజం వెంకటఅప్పారావు, జడ్పీ అధికారులు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే మన ధ్యేయం: సత్తుపల్లి ఎమ్మెల్యే

మనం అంతా ప్రజాప్రతినిధులం. అంతిమంగా ప్రజలకు జవాబుదారి చెప్పాల్సిన వాళ్లం. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దాం. సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు ప్రజల సమస్యలపై త్వరలో జిల్లా అధికారులతో సమీక్షించి వాటి పరిష్కారానికి తన వంతు కృషిచేస్తా. అటవీశాఖ అధికారులతో మాట్లాడి పోడు పట్టాదారుల సమస్యల పరిష్కారానికి కూడా కృషిచేస్తానన్నారు.

అందరి సమన్వయంతో పనిచేస్తా : వైరా ఎమ్మెల్యే

మీ అందరి సహకారంతో సమన్వయంతో జిల్లా అభివృద్ధికి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా. ఇప్పటికే పనుల పెండింగ్, నీటిపారుదల శాఖ పనులు, ఎస్సెస్పీ పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలతో అధికారులతో సమీక్షించారు. వాటి ఆధారంగా మన రాష్ట్ర మంత్రులతో కలిసి జిల్లా అభివృద్ధికి తన వంతు కృషిచేస్తా అన్నారు.

మొక్కజొన్న మిల్లర్ బోల్తా: మహిళ మృతి

గుండాల, జనవరి12: మొక్కజొన్న కంకులు మిల్లు పట్టేందుకు చేనుకు వెళ్తున్న ట్రాక్టర్ (మిల్లర్) బోల్తాపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శంభూనిగూడెం పంచాయతీ పరిదిలోని గురకలమడుగు గ్రామానికి చెందిన ఈసం రమణ(37) మొక్కజొన్నలు మిల్లు పట్టేందుకు ట్రాక్టర్‌లో వెళ్తుండగా పొలాల్లో రహదారి సరిగా లేక పోవడంతో ట్రాక్టర్ దిగి మిల్లర్ ప్రక్కనే నడుచుకుంటూ వస్తుంది. ఈ క్రమం లో మిలర్ అదుపుతప్పి మహిళపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురా లికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్సై గిరిదర్ రెడ్డి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు తరలించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

మణుగూరు రూరల్, జనవరి 12: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మణుగూరు మండలం సాంబాయిగూడెం గ్రామంలో జరిగింది. మణుగూరు మండలం పగిడేరుఎస్టీ కాలనీకి చెందిన సున్నం ఆదినారాయణ (38) శుక్రవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకని సాంబాయిగూడెంలోని పేరంటాళ్ల చెరువుకు వెళ్లాడు. గాలం వేసి చేపలను పట్టేందుకు చెరువులోకి దిగటంతో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. అటుగా వెళ్లిన వారు చెరువుగట్టుపై ఉన్న దుస్తులు, గాలాలను గమనించి మణుగూరు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. ఆదినారాయణకు భార్య రాజేశ్వరి, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

బూర్గంపాడు, జనవరి 12: ద్విచక్ర వాహనంనుంచి పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన బూర్గంపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ఏపీలోని కుక్కునూరు మండలం వేలేరు గ్రామానికి చెందిన మడిపల్లి వెంకటేశ్వర్లు(27) వ్యక్తి ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై వ్యక్తి గత పని మీద బూర్గంపాడు వచ్చినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో బూర్గంపాడు శివారులో ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నేలకొండపల్లి,జనవరి12:అడ్డం వచ్చిన గేదెను తప్పించబోయి స్కూటీని ఢీకొని ఆటో పల్టీ కొట్టిన సంఘటన శుక్రవారం చెర్వుమాధారం క్రాస్ రోడ్డు సమీపంలో జరిగింది. వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం తురకగూడేనికి చెందిన కొర్రపాటి రామయ్య, కొర్రపాటి శౌరి నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామం వెళ్లటానికి తురకగూడెం నుంచి కోదాడకు వచ్చారు. కోదాడలో నేలకొండపల్లి ఆటో ఎక్కారు. ఆటో పైనంపల్లి సమీపంలోని టోల్ నిర్మాణం వద్దకు రాగానే ఓగేదె అడ్డం వచ్చింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న స్కూటీ సైతం గేదెను తప్పించబోయి వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో, స్రూటీ రెండు బోల్తా కొట్టాయి. ఆటోలో ఉన్న రామయ్య, శౌరిసాదిక్‌లతో పాటు స్కూటీ నడుపుతున్న సత్యనారాయణకు తీవ్ర గాయాలైనాయి. గాయపడిన వారికి నేలకొండపల్లిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం ఖమ్మం తరలించారు.

బోనకల్‌లో వృద్ధుడికి గాయాలు

బోనకల్, జనవరి 12: మండలంలోని రావినూతల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే రామాపురం గ్రామానికి చెందిన కట్టు బాస్కర్ కిరాణా సరుకుల కొరకు ద్విచక్రవాహనంపై బోనకల్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో రావినూతలలో మెయిన్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది కోట బాను సహాన్, చక్రవర్తిలు ప్రథమ చికిత్స చేసి ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

తల్లాడ, జనవరి 12: తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూదరులనుంచి రూ.2500నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

చంద్రుగొండ, జనవరి 12: చంద్రుగొండ శివారు ఉత్తరపొంట వద్ద శుక్రవారం వరిగడ్డి ట్రాక్టర్ విద్యుదాఘాతానికి గురై అగ్నికి ఆహుతైయింది. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు పోతురాజు ఆదినారాయణ ఉత్తరపొంట సమీపంలో వరిగడ్డిని ట్రాక్టర్ లోడు చేసుకొని తీసుకుపోతున్నాడు. ఈ క్రమంలో ఉత్తరపొంట వద్ద ఇంటి సర్వీస్ వైరు ట్రాక్టకు తగిలింది. దీంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా కాలిపోగా ట్రాక్టర్ ట్రక్కు పాక్షికంగా కాలింది.

ఖమ్మం, పాల్వంచలో ఎండు గంజాయి పట్టివేత

ఖమ్మంసంక్షేమవిభాగం/పాల్వంచ, జనవరి 12: ఏపీ నుంచి ఖమ్మం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు గంజాయి ముఠాలను ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులు నిందితులతో సహా పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. భద్రాచలానికి చెందిన చల్లా ఉపేందర్‌రెడ్డి హైదరాబాద్‌కు 4కేజీల ఎండు గంజాయిని తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో ఖమ్మం ఎక్సైజ్ అధికారులు ఖమ్మంలో వాహనతనిఖీలు నిర్వహించి నిందితుడుతో పాటుగా గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. అలాగే చెన్నైకి చెందిన భోజరాజన్ అతని స్నేహితుడు నరేశ్‌లు కలిసి అక్రమంగా 8కేజీల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఖమ్మంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నిందితులతో సహా గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. నిందితులను స్వాదీనం చేసుకున్న ఎండు గంజాయిని కోర్టులో హాజరు పర్చినట్లు ఖమ్మం ఎక్సైజ్ 2స్టేషన్ సీఐ రాజీరెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఇన్స్‌పెక్టర్లు విజేందర్, ఎస్ఐలు అచ్చారావు, ఎం సరిత, నాయక్, వలరాజు, లాజర్, నాగేశ్వరరావు, రాములు, మౌలంకర్, రాధ, సురేందర్, గురుప్రసాద్, విశ్వనాథ్, నరేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

పాల్వంచలో ఐదున్నర కిలోల పట్టివేత

పాల్వంచ: పాల్వంచలో టౌన్ పోలీసులు అక్రమంగా బస్సులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పాల్వంచ టౌన్ పోలీసులు బస్టాండ్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న బస్సులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించి పోలీసులను చూసి తడబడ్డాడు. అనుమానించిన పోలీసులు వెంటనే బస్టాండ్‌లోకి ప్రవేశించి బస్సును నిలిపి తనిఖీ చేశారు. అతని బ్యాగులో ఐదున్నర కేజీల ఎండు గంజాయిని కనుగొన్నారు. అతనిని స్టేషన్‌కు తరలించి విచారించగా అతను హైదరాబాదు నివాసి అయిన విజయ్ పాటిల్‌గా తేలింది. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

పురుగుమందు తాగి వివాహిత..

పాల్వంచ, జనవరి 12: పురుగులమందు తాగి వివాహిత మృతిచెందిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన మాళోత్ అంజలి (20)కి ఇందిరా కాలనీకి చెందిన ప్రశాంత్‌తో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొద్ది కాలంగా అంజలీ కడుపు నొప్పితో బాధపడుతుంది. తన బాధను భర్తతో మొరపెట్టుకుంది. నాలుగు రోజుల క్రితం కేశవాపురం తల్లిదండ్రుల ఇంటివద్ద పురుగుమందు(గడ్డిమందు) తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన తొలుత పాల్వంచ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపించారు. వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స జరిపించారు. చికిత్స పొందుతూ అంజలి గురువారం అర్థరాత్రి మృతిచెందింది. మృతురాలికి సంవత్సరంన్నర బాబు ఉన్నాడు. మృతురాలి తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు గ్రామీణ ఏఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ..

దుమ్ముగూడెం జనవరి 12: మండల పరిధి పెదనల్లబల్లికి చెందిన బోడపట్ల జగదీష్(22) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హైదరాబాదులో ఆత్మహత్యకు పాల్పడిన విషయం శుక్రవారం వెలుగు చూసింది. మాదాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న జగదీష్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సమా చారం అందుకున్న జగదీష్ కుటుంబసభ్యులు హుటాహు టిన హైదరాబాదు బయలుదేరారు. ఆత్మహత్యపై కు టుంబసభ్యులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ఆసుపత్రి ఆవరణంలో గుర్తు తెలియని వ్యక్తి..

ఖమ్మం కలెక్టరేట్/ ఖమ్మం క్రైం, జనవరి-12: జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆస్పత్రి ఆవరణంలోని మార్చురీ సమీపంలో మామిడి చెట్టుకు ఓ గుర్తుతెలియని యువకుడు (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆస్పత్రి సిబ్బంది చెట్టుకు వేలాడుతున్న అయువకుని మృతదేహాన్ని చూసి అధికారులకు సమాచారాన్ని అందిచారు. టూటౌన్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మార్చురీలో ఉంచారు. ఆ యువకుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆత్మహత్యకు కారణాలు కూడా తెలియాల్సి ఉంది. ఆస్పత్రి అధికారులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రఘునాథపాలెం మండలంలో గుట్టలపై జీపీఎస్ సర్వే

రఘునాథపాలెం,జనవరి12: రఘునాథపాలెం మండలంలోని గుట్టల తవ్వకాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన మైనింగ్‌శాఖ సాంకేతిక అధికారులు ఆధునిక డ్రోన్‌లతో జీపీఎస్ పరికరాలతో సర్వే నిర్వహించారు. రఘునాథపాలెం, చింతగుర్తి, శివాయిగూడెం రెవెన్యూ గ్రామాల్లోని మట్టి గుట్టల తవ్వకాలను సర్వేలో నమోదు చేశారు. కాగా సర్వే విషయాలను జిల్లా మైనింగ్ అధికారులు గుట్టుగా నిర్వహించారని స్థానికంగా విమర్శలు వెలువడ్డాయి. హైదరాబాద్ మైనింగ్ సాంకేతిక అధికారి రామలింగయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మైనింగ్ సర్వే విషయంపై స్థానిక మైనింగ్ రాయల్టీ ఇన్స్‌పెక్టర్ రాజారెడ్డిని ‘ఆంధ్రజ్యోతి’ ఫోన్‌లో వివరణ కొరకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. గుట్టుగా అధికారులు అధునాతన పరికరాలతో సర్వే నిర్వహించటం రఘునాథపాలెం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్‌కు భద్రాద్రి విద్యార్థులు

» డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని ఫరిదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇండి యా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్స్‌కు (ఐఐఎస్ఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజు తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాధికారి కార్యాలయంలో ఐఐఎస్ఎఫ్‌కు ఎంపికైన విద్యార్థులు, ఎస్కార్టు ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ పబ్లిక్ అవుట్‌రీచ్ ఇన్ అమృత్‌కల్ అనే ప్రధానాంశంపై ఈ ఫెస్టివల్ జరుగుతుదని స్టూడెంట్ సైన్సెస విలేజ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులను ఎంపిక చేశారు. రాష్ట్రం నుం చి మొత్తం 20మందిని ఎంపిక చేయగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఫరీదాబాద్‌లో జరి గే ఇండియాఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్స్‌లో జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొంటారు. ఈ ఫెస్టివల్‌లో విద్యార్థులతో శాస్త్రవేత్తలు, ఇంటర్ యాక్షన్స్, కొత్త ఆవిష్కరణలు, పరిశోధనాశాలు, జాయ్‌పుట్‌టెర్నింగ్, శాస్త్రం పట్ల అవగాహన, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన యువశాస్త్రవేత్తలు, విద్యార్థులు తమ పరిశోనదలు ఎంపికలకు వివరిస్తారు.

జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులు

కే. అశ్వని, ఆశ్రమ పాఠశాల రోంపేడు (పదో తరగతి), ఎండి, రియాన్ నసీఫ్ ఎక్సలెంట్ హైస్కూల్ 9వ తరగతి మణుగూరు, బాణోత్ దనుష్, జిల్లా పరిషత్ 8వ తరగతి పోకలగూడెం, కట్టం అలేఖ్య త్రివేణి స్కూల్ కొత్తగూడెం 10వ తరగతి, బి. చరణ్ జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి దమ్మపేట, ఎస్. కిషన్ ఆదర్శ, సెయింట్ పాల్స్ హైస్కూల్ పదో తరగతి భద్రాచలం, బాదావత్ కార్తీక్ పదో తరగతి ఇల్లెందు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉన్నారు. వీరితోపాటు జిల్లా సైన్స్ ఆఫీరస్ ఎస్. చలపతిరాజు, ఇల్లెందు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎం. పార్వతి హజరవుతున్నారు. జిల్లా నుంచి ఒకేసారి ఏడుగుర ఇండియా ఇంటన్నేషనల్ ఫెస్టివల్ 2023కి హజరు కావడం విశేషం.



ఎంపికైన విద్యార్థులతో డీఈవో, ఉపాధ్యాయులు


అన్నపురెడ్డిపల్లిలో కూలిపోతున్న ఎస్సీ గురుకుల పాఠశాల భవనం


జూలూరుపాడు మండలం గుండెపుడిలో శిథిలావస్థలో పశువైద్యశాల భవనం


శిథిలావస్థకు చేరిన చర్ల తహసీల్దార్ కార్యాలయం



పెచ్చులూడుతున్న అంజనాపురం పాఠశాల స్లాబు, శిథిలావస్థలో అశ్వారావుపేట మండలం వినాయకపురంలోని పశువైద్యశాల భవనం



జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదిలోనే పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)


పెనుబల్లిలో అస్తవ్యస్తంగా మండల వనరుల కేంద్రం

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఏ భవనం చూసినా..
ఏమున్నది గర్వకారణం?

ఎప్పుడో ఏళ్ల నాటి క్రితం కట్టిన భవనాలవి. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను కాంట్రాక్టర్లు గాలికి వదిలేయడంతో కూలేదశకు చేరుకున్నాయి. వాటి స్థానంలో కొత్తభవనాలను ప్రభుత్వాలు నిర్మించకపోవడంతో వాటిల్లోనే పలు రకాల ప్రభుత్వ కార్యకలాపాలు సాగుతున్నాయి. విద్య, వైద్యం, రెవెన్యూ, వ్యవసాయం, పశుసంవర్ధకం.. ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల శాఖల భవనాల పరిస్థితి ఇదే. శుక్రవారం ఖమ్మంలో గ్రంథాలయం కూలిన నేపథ్యంలో ఇరు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఈసందర్భంగా శిథిల వాస్తవాలు కళ్లకు గట్టాయి.

-నెట్‌వర్క్


శిథిలావస్థలో మత్కేపల్లి నామవరం పంచాయతీ భవనం


శిథిలావస్థలో రామలింగాలపల్లి ప్రభుత్వ పాఠశాల


పెనుబల్లిలో శిథిలావస్థకు చేరిన ఎంఆర్‌సీ భవనం


శిథిలావస్థలో సుజాతనగర్ మండలం సీతంపేట పాఠశాల భవనం


కూలేందుకు సిద్ధంగా ఏన్కూరు ఎంఆర్‌సీ భవనం


శిథిలావస్థలో తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయం


పాడుబడ్డ భవనంలా దర్శనమిస్తున్న తిరుమలాయపాలెం సబ్ స్టేషన్



మిర్చి రైతు కన్నీరు

- మిరపను దెబ్బతీసిన తెగుళ్లు, మిచౌంగ్ తుఫాన్
- తాలుగా మారిన ఎర్రబంగారం
- అన్నదాతలకు తీవ్ర నష్టం
- కూలీలను పెట్టి ఏరిస్తున్న వైనం


మిర్చిలో తాలు కాయలను ఏరుతున్న మహిళలు



తల్లాడ, జనవరి 12: మిర్చి రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉంది. అనేక వ్యయప్రయాసలకోర్చి పెట్టుబడులు ముగిసి పంట చేతికొచ్చే తరుణంలో ఒకవైపు మిచౌంగ్ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలు, మరోవైపు వేరుకుళ్లు తెగుళ్లు, ఎర్రనల్లి ఆశించాయి. దీంతో రైతులు మిర్చి రైతులు కన్నీటి ప ర్యంతమవుతున్నారు. దీంతోపాటు ప్రస్తుతం కోసి కల్లాల్లో ఆరబోసిన మిర్చిలో తాలు అధికమవుతుండటం రైతులను మరింత కుంగదీస్తోంది. గత ఏడాది మిర్చి పంటకు ధర ఆశాజనకంగా ఉండటంతో 2023-24 వానాకాలం సీజన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక విస్తీర్ణంలో తల్లాడ మండలంలో 6,820 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చి సాగు కోసం ఇప్పటివరకు ఎకరాకు రూ.లక్ష మేరకు పెట్టుబడులు పెట్టారు. కౌలురైతులు అదనంగా ఎకరాకు రూ.30 వేల చొప్పున కౌలు చెల్లించారు. వర్షాభావ పరిస్థితుల్లో నాటిన మిర్చి మొక్కలను కాపాడుకోనేందుకు కొందరు రైతులు మరో రూ.లక్షకుపైగా ఖర్చుచేసి బోర్లు వేయించి విద్యుత్ మోటార్ల ద్వారా సాగునీరం దించేందుకు భగీరథ ప్రయత్నం చేశారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల డిసెంబరు ఐదారు తేదీల్లో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలకు పూత, కాయ దశలో ఉన్న మిర్చి మొక్కలు నేలమట్టమయ్యాయి. నేలమట్టమైన మిర్చి మొక్కలను కూలీ లతో పైకి లేపే క్రమంలో కొంతమేరకు పూత, కాయ రాలిపోయింది. మిగిలిన కాయ లు పండుబారే సమయంలో తెలుపురంగులోకి మారి తాలుగా తయారయ్యాయి. ప్ర స్తుతం కూలీలతో మిర్చి పండ్లు కోసి కల్లాల్లో ఆరబోస్తున్నారు. ఆరిన నాణ్యమైన మి ర్చి నుంచి తాలును కూలీలతో వేరు చేయటం జరుగుతుంది. గతంలో సాధారణంగా క్వింటాకు పదికిలోల మేరకు తాలు వచ్చేది. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల వల్ల కాయ దశలో తెల్లబారడం వల్ల ఇప్పుడు క్వింటాకు 30కిలోల మేరకు తా లు వస్తోంది. గతంలో ఎకరంలో పండిన మిర్చిలోనుంచి తాలును పదిమంది కూలీలు వేరుచేయగా ఇప్పుడు ఇందుకుగానూ 25మంది కూలీలు అవసరమ వుతోంది. ఒక్కో కూలీకి రూ.350చొప్పున చెల్లించవల్సి రావడంతో రైతులకు అదనపు భారమవుతోంది. మార్కెట్లో నాణ్యమైన మిర్చి క్వింటా ధర రూ.16వేల నుంచి రూ.18వేల ధర ఉంది. తాలురకం మిర్చి క్వింటా ధర రూ.8వేల నుంచి రూ.10వేలు పలుకుతోంది. గతంతో పోలిస్తే మిర్చి సాగు వ్యయం పెరిగి దిగుబడులు తగ్గడమేకా కుండా చివరకు మిర్చిలో తాలు అధికమవ్వడంతో మిర్చి రైతుల పరిస్థితి కడుదయనీయంగా మారింది. కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాలు అధికమవ్వడం మరింత కుంగదీసింది
చింతలపాటి శేషగిరిరావు, కౌలురైతు, మల్లవరం



మూడెకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగుచేశాను. వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల మిర్చి సాగుకు పెట్టుబడి పెరిగింది. మిచౌంగ్ తుఫాన్ వల్ల మిర్చి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మిర్చిలో తాలుశాతం 10నుంచి 30శాతం మేరకు అధికమవ్వడం మరింత కుంగదీసినట్లయింది. తాలు మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి. లేనిపక్షంలోఅన్నదాతలు మరింత నష్టపోవాల్సి వస్తుంది. కౌలు రైతులకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

ఖమ్మం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కిరణ్‌కుమార్

ఎంసీహెచ్ సూపరింటెండెంట్‌గా బాబూరత్నాకర్

ఉత్తర్వులు జారీ చేసిన వైద్యకళాశాల ప్రిన్సిపాల్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 12: ఖమ్మం జిల్లా సర్వజన ఆస్పత్రి పర్యవేక్షకుడిగా (సూపరింటెండెంట్) కిరణ్‌కు మార్ నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన కిరణ్‌కుమార్ వ్యక్తిగత కారణాలతో సూపరింటెండెంట్‌గా విధుల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో డి ప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్ కిరణ్‌కుమార్‌కు బాధ్యతలను అప్పగించారు. దీనికి అనుసంధా నంగా ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)కు ప్రత్యేక సూపరింటెండెంట్‌గా పీడియాట్రీషియన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాబూరత్నాకర్‌కు బాధ్యత లను అప్పగించారు. ప్రస్తుతం ఆర్ఎంవో డాక్టర్ రాంబాబుకు మాతాశిశు సంరక్షణ కేంద్రం నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే వారిని విధుల్లో చేరాల్సిందిగా ఆదేశించగా శుక్రవారమే వారు బాధ్యతలను చేపట్టారు. బాధ్య తలు చేపట్టిన సూపరింటెండెంట్లు డాక్టర్ కిరణ్‌కుమార్, బాబూరత్నాకర్, డాక్టర్ రాంబాబును అభినందించారు. సిబ్బంది కూడా వారికి స్వాగతం పలికారు.


ఆర్ఎంవో రాంబాబుకు ఎంసీహెచ్ నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగిస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఇతర అధికారులు

‘సామాజిక స్థితిగతులే కవితావస్తువులు’

ఖమ్మం, సాంస్కృతికం, జనవరి 12: సామాజిక స్థితిగతులే కవితా వస్తువులని ప్రముఖ కవి, కథకుడు అఫ్సర్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని హార్వెస్ట్‌స్కూల్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన చాయ్ పే చర్చ ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా తన కు ప్రపంచ సాహిత్య ధోరణులను పరిశీలించే అవకాశం కలిగిందన్నారు. ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించినా అనేక అసమానతలకు కారణం ఆర్థిక పరమైన భేదాలే ప్రధాన కారణంగా కనిస్తున్నాయన్నారు. సృజనశీలురైన కవి రచయితలకు సామాజిక అధ్యయనం అత్యవసరమన్నారు. సగటు మనిషి సాధక బాధకాలు, పాలకుల తీరు తెన్నులు, పరిపాలనా ప్రభావాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయటం ద్వారా సృజన కారులు వస్తు కొరతను అధిగమించాలన్నారు. వ్యక్తుల ఆర్థిక స్థితి గతులు ఆలోచనా విధానాన్ని నిర్ణయిస్తాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు వ్యక్తులను ఆలోచనా త్మకత వైపు నడిపిస్తాయన్నారు. వ్యక్తులపై లింగ, కుల, అక్షరాస్యత భేదాల కన్నా ఆర్థిక తారతమ్యాలే ఎక్కువ ప్రభావం కలిగిస్తాయన్నారు. కవిత్వంలోని కొన్ని వాక్యా లు ఆ కవిత్వాన్ని బతికిస్తాయన్న నమ్మకం ఇప్పటి వరకూ ఉన్నప్పటికీ మొత్తంగా కవిత్వంలోని మూల వస్తు బలమే ఆ సాహిత్యాన్ని అజరామరం చేస్తుందన్న వా స్తవాన్ని గ్రహించాలన్నారు. తన మిత్రులతో కలిసి వెలువరించిన రక్త స్పర్శ కవితా సంపుటి దశాబ్దాలు దాటినా ఇంకా తన ప్రభావాన్ని కలిగి ఉండటం ఇందుకు ఉదాహరణ అన్నారు. రక్త స్పర్శ నాటి ప్రత్యేక సందర్భాలు ఇప్పటికీ గుర్తుకు తెచ్చే విధంగా కవితా సంపుటి తన ఉనికిని ప్రదర్శిస్తోందన్నారు. గతంలో ఒక పుస్తకాన్ని వెలువరించటం ఎంతో కష్టంగా ఉండేది కాగా ప్రస్తుతం సాహిత్యం విరివిగా వస్తోం డటం స్వాగతనీయం అన్నారు. అయితే చదువరుల సంఖ్య గతంతోపోలిస్తే ఆశాజన కంగా లేదన్నారు. కవులు పూర్వ కవులను ఆరాధించటం వరకు ఫర్వాలేకున్నా వారిని అనుకరించటం సమర్థనీయం కాదన్నారు. అజంతా, నారాయణ బాబు, వేగుంట మోహన్ ప్రసాద్, బైరాగి సాహిత్యశైళి ఇందుకు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం, ఆచార్య ఐలయ్య. విద్యావేత్త రవిమారుత్, ఐవీ రమణారావు, కవులు షుకూర్, తిర్మల్, కపిల రాంకుమార్, గుర్రం సీతారాములు, రౌతు రవి, ఇబ్రహీం నిర్గున్, తోట సుభాషిణి, ఫణిమాధవి, నిర్మల, యాకమ్మ పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ సంపత్

నిందితుడి వివరాలు సేకరించిన జైళ్లశాఖ వరంగల్ డీఐజీ

తల్లాడ, జనవరి 12: తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఓ బాలిక హత్యకేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న నిందితుడి వివరాలను శుక్రవారం వరంగల్ డీఐజీ సంపత్ సేకరించారు. అన్నారుగూడెం గ్రామంలో 1996లో బాలిక హత్య కేసులో అదే గ్రామానికి చెందిన రామారావు జీవితఖైదును అనుభవిస్తున్నాడు. హత్య జరిగిన సమయంలో రామారావు మైనర్ అని దీని దృష్ట్యా శిక్షను తగ్గించాలని కోరుతూ అతడి తల్లి హైకోర్టును ఆశ్రయించింది. ఈమేరకు రామారావుకు సంబంధించిన జనన రిజిస్ట్రర్ల పరిశీలన కోసం వరంగల్ డీఐజీ సంపత్ తల్లాడ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వి.రవికుమార్‌ను కలిసి అలాగే అన్నారుగూడెంలోని పాఠశాలను సందర్శించి జనన నమోదు రికార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్ఐ పి.సురేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల

దమ్మపేట, జనవరి 12: మొద్దులగూడేనికి చెందిన బచ్చు సత్యనారాయణ కుటుంబసభ్యులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణ కుమార్తె హఠాన్మరణం చెందింది. ఈవిషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల సత్యనారాయణ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుమార్తె చిత్రపటానికి తుమ్మల పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ఓదార్చారు. మంత్రి తుమ్మల వెంట దొడ్డా ప్రసాద్, దొడ్డా సత్యనారాయణ, దొడ్డా భాస్కరరావు, మొరంపూడి గోపాలరావు, బాల రామారావు, దొడ్డా కృష్ణమూర్తి, సత్యబాబు, ములగపాటి సత్యనారాయణ ఉన్నారు.


సత్యనారాయణను పరామర్శిస్తున్న తుమ్మల

ఏపీ నుంచి షిర్డీకి పాదయాత్ర

తిరుమలాయపాలెం, జనవరి12: ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలేం గ్రామస్థులు మహారాష్ట్రలోని షిరిడీ వరకు పాదయాత్ర చేపట్టారు. సుమారు 46రోజులపాటు 1200కి.మీ.వరకు ఈపాదయాత్ర కొనసాగుతుంది. ఈపాదయాత్రలో సుమారు 46మంది భక్తులు పాదయాత్రగా షిరిడీకి చేరుతారు. శుక్రవారం తిరుమలాయపాలెం మీదుగా పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భగా తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ నాయకులు కొండబాల బాబురావు, సావిత్రి, తాటికొండ సీతారామరావు, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికారు.

బీటీపీఎస్ ను పరిశీలించిన థర్మల్ డైరెక్టర్

మణుగూరు, జనవరి 12: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య సందర్శించారు. ప్లాంట్‌ను పరిశీలించి ఉత్పతి వివరాలను బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రానున్న వేసవిలో చేయాల్సిన ఉత్పత్తి, డిమాండ్, ముందస్తు చర్యలు తదితర అంశాలపై సీఈ తో పాటు ఇతర ఎస్ఈ, డీఈలతో చర్చించారు. తగిన సూచనలు చేశారు. బీటీపీఎస్‌లోని యూనిట్-3 నిరంతరాయంగా 100 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తిని సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని థర్మల్ డైరెక్టర్ స్థానిక అధికారులతో పాటు కేక్ ను కట్ చేశారు. వారికి అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీల్లో ‘ఏకలవ్య’ విద్యార్థిని ప్రతిభ

కొత్తగూడెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీల్లో జిల్లాకు ద్వితీయ బహుమతి వరించింది. హైదరాబాద్ జిల్లాలో రామవరం ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కే. సుస్మిత పోస్టర్ మేకింగ్ (సందేశాత్మక చిత్రలేఖనం) విభాగంలో ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ విద్యార్థి సుస్మితను ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా శుక్రవంగా ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి విద్యార్థికి ప్రథమ స్థానం..

యువజనోత్సవాల్లో కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రి కళాశా లకు చెందిన పోస్టర్ మేకింగ్ కళాశాల విభాగంలో కుసుమ పీజీ వి ద్యార్థి ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఐడీఓసీలో అ డిషనల్ కలెక్టర్ రాంబాబు ప్రత్యేకంగా శుక్రవారం అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని కోరారు.


తాను గీసిన చిత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాకు అందిస్తున్న విద్యార్థిని సుస్మిత

ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా: తుమ్మల


తుమ్మలను సన్మానిస్తున్న నర్సింహారావు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి11: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు సన్మానించారు. శుక్రవారం ఖమ్మంలో పర్యటించిన తుమ్మల నాగేశ్వరరావు వడ్డెబోయిన నర్సింహారావు నివాసానికి వెళ్లి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన శ్రీను, శంకర్, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, దాసరి పూర్ణ, అనిశెట్టి గిరి, బండారు శ్రీను, రాకొండే కృష్ణ, నాగిశెట్టి కృష్ణ, మార్కపూడి భూషణం, ఖాజా, తాళ్లూరి హనుమంతరావు, దోడ్డా ఆశోక్, తాటికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరపాలకసంస్థలో ప్రక్షాళన

- ఇద్దరు డీఈలను బదిలీ
- మాతృశాఖకు ఉప కమిషనర్ ?



ఖమ్మంకార్పొరేషన్, జనవరి 12: ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రక్షాళనకు కమిషనర్ ఆదర్శ్‌సురభి నిర్ణయించారు. డిప్యూటీ కమిషనర్‌ను మాతృశాఖ అయిన పంచాయతీరాజ్ శాఖకు తిరిగి పంపాలని నిర్ణయించగా, ఇంజనీరింగ్ విభాగంలోని ఇద్దరు డీఈలను బదిలీ చేశారు. ప్రస్తుతం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న బీ.మల్లీశ్వరి గతంలో ఎంపీడీవోగా పని చేసి, డిప్యుటేషన్‌పై నగరపాలకసంస్థ సహాయ కమిషనర్‌గా వచ్చారు. అనంతరం ఉద్యోగోన్నతిపై ఉప కమిషనర్ అయ్యారు. కాగా వరంగల్‌లో ప్రజారోగ్యశాఖనుంచి డిప్యుటేషన్‌పై ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చిన ఇంజనీరింగ్‌శాఖ డీఈ స్వరూపరాణిని నిర్మల్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. మరో డీఈ రంగారావును వరంగల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

డిప్యూటీ కమిషనర్ పోస్ట్ లేకున్నా...

ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్ట్ లేకున్నా, గత ప్రభుత్వహయాంలో సృష్టించి, అప్పటి వరకు నగరపాలకసంస్థ సహాయ కమిషనర్‌గా ఉన్న మల్లీశ్వరికి ఉద్యోగోన్నతి కల్పించి ఉప కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు ఉప కమిషనర్‌గా ఆమె గత ప్రభుత్వంలో మాజీ ప్రజాప్రతినిధికి అనుకూలంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉప కమిషనర్ ప్రస్తుతం సెలవుపై వెళ్లగా. ఆమెను తిరిగి మాతృశాఖ పంచాయతీరాజ్‌కు పంపుతారని సమాచారం.

ఇద్దరు డీఈలుగా కూడా..

ప్రస్తుతం సెలవుపై వెళ్లిన ఇద్దరు డీఈలలో స్వరూపరాణి వరంగల్‌లోని ప్రజారోగ్యశాఖనుంచి డిప్యుటేషన్‌పై ఖమ్మం నగరపాలకసంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో డీఈగా డిప్యుటేషన్‌పై వచ్చారు. డిప్యుటేషన్ కాలం పూర్తయిన ఆమె ఇక్కడే కొనసాగుతున్నారు. స్వరూపరాణిపై పలు ఆరోపణలు చేస్తూ గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. కాగా స్వరూపరాణి సెలవుపై వెళ్లగా ఆమెను నిర్మల్ బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే సెలవుపై వెళ్లిన మరో డీఈ రంగారావును వరంగల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మరి కొందరి బదిలీలు

ఖమ్మం నగరపాలకసంస్థలో సుదీర్ఘకాలం గా పనిచేస్తున్నవారు, అలాగే ఆరోపణలు ఎదుర్కొం టున్న వారి జాబితాను ఇప్పటికే తయారు చేసినట్లు తెలుస్తోంది. వారిని త్వరలోనే బదిలీ చేయనున్నట్లు సమాచారం. సం క్రాంతి తరువాత ప్రక్షాళన జరుగుతందనే ప్రచారం జరుగుతోంది.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సందడి


ఖమ్మం సర్వజ్ఞ పాఠశాలలో..


ఖమ్మం న్యూరిడ్జ్ స్కూల్‌లో


ఖమ్మం లిటిల్ ఇండియన్ పాఠశాలలో..


తనికెళ్ల విజయ' కళాశాలలో ముగ్గులువేస్తున్న మహిళలు


వైరా లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఎమ్మెల్యే, కోడిపందాలు..

ఏఎస్‌రావు టాలెంట్ టెస్ట్‌లో 'న్యూవిజన్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ కార్తీక్

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 12: నగరంలోని న్యూవిజన్ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు డాక్టర్ ఏఎస్‌రావు టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ తెలిపారు. 47 మంది ఉత్తమ ప్రతిభ కనబరచి సెకండ్ లెవల్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. మెత్తం 82 మంది అర్హత సాధించగా అందులో 47 మంది న్యూవిజన్ విద్యార్థులే ఉండటం అభినందనీయమన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మెన్ సీహెచ్‌జీకె ప్రసాద్, ప్రిన్సిపాల్ మైఖేల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ యువజనోత్సవాలకు అఖిల

వైరా, జనవరి 12: మహారాష్ట్రలోని నాసిక్‌లో జరుగుతున్న 27వ జాతీయ యువజనోత్సవాల్లో వైరా మండలంలోని నారపనేనిపల్లి గ్రామానికి చెందిన కనకపూడి అఖిల పాల్గొంది. స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజనోత్సవాలు నిర్వహిస్తున్నారు. కేంద్రప్రభుత్వంలోని క్రీడలు, యువజన వ్యవహారాలశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 12నుంచి 16వతేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవాల్లో నారపనేనిపల్లిలోని కనకపూడి ప్రసాద్, రత్నకుమారి దంపతుల కుమార్తె అఖిల పాల్గొంది. గత ఏడాది ఢిల్లీలో జరిగిన యువజనోత్సవాల్లో అఖిల పాల్గొంది.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

వైరా, జనవరి 12: మండలంలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద 30మంది లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా, కొణిజర్ల ఎంపీపీలు వేల్పుల పావని, గోసు మధు, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, 14వ వార్డు కౌన్సిలర్ డి.కోటయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుమ్మా రోశయ్య, బీడీకే.రత్నం, అష్టగుర్తి సర్పంచ్ ఇటుకల మురళీ, గిర్దావర్‌లు ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కంటితుడుపుగా వైరా-నెమలి బస్సు సర్వీస్

వైరా, జనవరి 12: వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ హెచ్చరికలతో ఆర్టీసీ అధికారులు వైరా-నెమలి రూట్లో కంటితుడుపుగా ఒక బస్సు సర్వీస్‌ను నడుపుతున్నారు. ఖమ్మం డిపోకు చెందిన బస్సును ఉదయం, సాయంత్రం ఒక్కో ట్రిప్పు తిప్పుతున్నారు. వైరా బస్టాండ్ నుంచి ఉదయం 7.15గంటలకు, సాయంత్రం 4.15గంటలకు నెమలి వరకు నడుపుతున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ముదిగొండ, జనవరి 12: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ముదిగొండలో శుక్రవారం జరిగిన ఆపార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రకటించిన విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు నరసింహా, ఉపేందర్, ఇరుకు కృష్ణ, పులి నర్సింహారావు, బాలయ్య పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌ను సన్మానించిన తహసీల్దార్

పెనుబల్లి, జనవరి 12: పెనుబల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నల్లగట్ల విజయప్రసాదరావు కుమార్తె సౌమిస్వరాజ్ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిచేసుకొని సత్తుపల్లి బస్తీ దవాఖానాలో వైద్యురాలిగా నియామకం పొందింది. సౌమిస్వరాజ్‌ను తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీవో వాల్మీకి కిషోర్, పలువురు కార్యదర్శులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

టీటీ క్రీడాకారిణికి అభినందన

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 12: భోపాల్‌లో ఈనెల 15 నుంచి 19 వరకు జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన నగర క్రీడాకారిణి ఎం.నిరీక్షణను శుక్రవారం డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి అభినందించారు. నిరీక్షణ జాతీయ పోటీలలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీటీ కోచ్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యధర్శి ఓలేటి సాంబమూర్తి ఉన్నారు.

కారుణ్య నియామకాల డ్రైవర్లకు వైద్య నివేదికలు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 12: ఖమ్మం ఆర్టీసీ రిజియన్ పరిధిలో కారుణ్య నియామకాల్లో బాగంగా శుక్రవారం ఇద్దరు డ్రైవర్లకు ఆర్టీసీ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ గిరిసింహారావు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికలు అందించారు. డ్రైవర్లు జి హరిష్, టి రవీంధర్‌రెడ్డిలకు వైద్య పరీక్షల నివేదికలును అందించారు.

ప్రణాళికాబద్ధంగా మునిసిపాలిటీల

బడ్జెట్ రూపకల్పన చేయాలి: కలెక్టర్


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 12: ప్రణాళికాయుతంగా జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల బడ్జెట్ రూపకల్పన చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మునిసిపాలిటీలకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పనపై మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వేతనాలు, కరెంట్ చార్జీలు, సీసీ చార్జీలు, రుణాల చెల్లింపుకు ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. మునిసిపాలిటీల్లో విలీన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డుల నిర్మాణం చేయాలని సూచించారు. మునిసిపాలిటీలకు ప్రభుత్వం అందించే గ్రాంట్లతో పాటు తమ రెవెన్యూ పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపాలిటీల్లో ప్రాపర్టీ టాక్స్ వందశాతం వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేయాలన్నారు. నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తాగునీటి సంబంధిత పనులు ఉంటే తక్షణమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్ఎస్ పై దృష్టి సారించి పురోగతిలో ఉన్న పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి సత్యప్రసాద్, సత్తుపల్లి, మధిర, వైరా మునిసిపాలిటీల కమిషనర్లు సుజాత, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ ఈఈ కృష్ణాలాల్, జేఈవోలు శివలింగం, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించిన సండ్ర

సత్తుపల్లి/కల్లూరు/తల్లాడ, జనవరి 12: సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన రాచమళ్ల రవికుమార్-నాగమణి దంపతుల కుమార్తె భవ్యశ్రీ అనే విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం ల్యాప్‌టాప్‌ను అందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలలో జరిగిన కార్యక్రమంలో ఆయన భవ్యశ్రీకి అందజేశారు. భవ్యశ్రీ ఫ్యాషన్ డిజైనింగ్ మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ విభాగంలో 62వ ర్యాంకుతో సీటు సాధించింది. అంతకు ముందు ఆయన సత్తుపల్లి మండలంలోని తుంబూరు, సదాశివునిపాలెం, గౌరిగూడెం గ్రామాల్లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, సత్తుపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేస్, దొడ్డా శంకరరావు, మల్లూరు అంకంరాజు, చిలుకుర్తి కృష్ణమూర్తి, కాల్నేని వెంకటేశ్వరరావు, లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్లూరు: మండలంలోని చంద్రుపట్లలో శుక్రవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పలు కుటుంబాలను పరామర్శించారు. చంద్రుపట్లలో కాటంనేని వెంకట నరసయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న దొడ్డపునేని కోటయ్య , వెంకటేశ్వరరావు, దొడ్డపునేని భద్రయ్య, కాటంనేని రమణయ్యలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, వల్లపునేని భాస్కరరావు, సర్పంచు గొల్లమందల ప్రసాద్, జక్కంపూడి కిషోర్, రవి, సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కనకయ్యకు పరామర్శ

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లి ఎంపీటీసీ కోపిల కనకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, ఏఎంసీ వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు, సర్పంచ్ తూము శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు, నాయకులు నాయుడు పాల్గొన్నారు.

న్యూ గ్రాడ్యుయేట్స్ నూతన జేఏసీ ఎన్నిక

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 12: తెలంగాణ న్యూ గ్రాడ్యుయేట్స్ నూతన జేఏసీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా వడిగ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాళ్ళ భానుచందర్, కోశాదికారిగా తేరాల సాధన తోపాటు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

తల్లాడ, జనవరి 12: తల్లాడకు చెందిన క్యాన్సర్‌తో బాధపడుతున్న తడికమళ్ల మనీసరస్వతీకి జాంబవారసులం గ్రూపుసభ్యులు రూ.30వేలు ఆర్థికసహాయాన్ని ఎస్‌ఐ పి.సురేష్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్‌ఐ బంకా యాకోబు, గొల్లమందల విజయ్, వేల్పుల నరేష్, కొమ్ము సుధాకర్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, తడికమళ్ల రాఘవరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

యువత వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలి


ఖమ్మం, సత్తుపల్లిలో వివేకనంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్/సత్తుపల్లి/కారేపల్లి/వైరా/ఖమ్మం బైపాస్ రోడ్డు/నేలకొండపల్లి జనవరి 12: యువత స్వామి వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని డీవైఎస్‌వో సునిల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్టేడియం కోచ్‌లు, యువజన సర్వీసుల శాఖ సిబ్బంది,పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

మదర్‌థెరీసాలో యువజన దినోత్సవం

సత్తుపల్లి :సత్తుపల్లిలోని మదర్‌థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జ యంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హరికృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల డీన్ జాకీర్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ కే.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సృజన ఆధ్వర్యంలో..

సత్తుపల్లిలోని సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మోటార్ వెహికిల్ ఇనస్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య, సృజన నిర్వాహకులు రామకృష్ణ, బి.మధుసూదనరాజు, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

●వైరాలో వాణీవివేకానంద విద్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వివేకనంద చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరి వాణీ దంపతులు సన్మానించారు. వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో కూడా ఎమ్మెల్యే వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

●ఖమ్మంబైపాస్‌రోడ్: బీజేపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్, మంద సరస్వతి, బోయినపల్లి చంద్రశేఖర్, విజయారెడ్డి, కిరణ్, అరుణ పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్ మొహినుద్దీన్, శ్రీకాంత్, వేణు, శోభన్‌బాబు ధనమూర్తి పాల్గొన్నారు.

●కారేపల్లిలో జరిగిన వివేకనందుడి జయంతిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం కళాశాల సిబ్బంది, జిల్లా బీజేపీ నాయకులు తురక నారాయణ పాల్గొన్నారు.

● ఎర్రుపాలెంలో కైండ్లీ సంస్థ నిర్వహుకురాలు వేమిరెడ్డి అనూష, సభ్యులు కనకవేల్లి సత్యనారాయణ, నాగరాజు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి,గోపి నాయక్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి నామ: జిల్లా టెలికం సలహా మండలి సభ్యుడు చిత్తారు

నేలకొండపల్లి, జనవరి12: ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు నామా నాగేశ్వరరావు పేదలు, బడుగు, బలహీనవర్గాలు, కార్మిక పక్షపాతని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, జిల్లా టెలికం సలహామండలి సభ్యులు చిత్తారు సింహాద్రియాదవ్ అన్నారు. నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నేలకొండపల్లి వాసవీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో నేలకొండపల్లి ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. నామాను వచ్చే ఎన్నికలలో భారీ మొజార్టీతో గెలిపించుకోవాలని సింహాద్రియాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాసాని నాగేశ్వరరావు, గొలుసు రవి, కొండా కనకప్రసాద్, నామా సేవాసమితి నాయకులు చీకటి రాంబాబు, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శెట్టి సుధాకర్‌కు వద్దిరాజు నివాళులు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి12: కాంగ్రెస్ నాయకులు శేట్టి రంగారావు సోదరుడు శేట్టి సుధాకర్‌కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాళులు అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన శేట్టి సుధాకర్ సంస్మరణ సభను శుక్రవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగేందర్, సాధు రమేశ్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ జిల్లా ఇంచార్జీ కార్యదర్శి యర్రా శ్రీకాంత్, పాత్రికేయుల సంఘం అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ తదితరులు శేట్టి సుధాకర్‌కు నివాళులు అర్పించారు.

ఆంకాలజీలో సీటు సాధించిన భవ్య



సత్తుపల్లి, జనవరి 12: సత్తుపల్లికి చెందిన వైద్యుడు డాక్టర్ ఇనిమెర్ల రమేష్ చంద్ర కుమార్తె డాక్టర్ ఇనిమెర్ల భవ్య భువనేశ్వర్‌లోని సమ్ హాస్పటల్‌లో డీఎం అంకాలజీ (కాన్సర్ స్పెషాలిటీ)లో సీటు సాధించారు. భవ్య గ్రేటర్ నోయిడా లోని శారదా యూనివర్శిటీలో ఎం.డి (జనరల్‌మెడిసిన్)లో గోల్డ్ మెడల్ సాధించిన విషయం విదితమే. ఈ సందర్భంగా భవ్యను పట్టణ ప్రముఖులు పలువురు అభినందించారు.

విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ ప్రాధాన్యం

చింతకాని జనవరి 12: విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ ప్రాధాన్యమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెదపాక నవీన్ బాబు అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాక్షించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వర్లు, జూనియర్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

చింతకాని జనవరి 12: 3 నెలలుగా ఉన్న పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరి చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు పంచాయతీ కార్మికులు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం 2023లో సమ్మె నిర్వహించగా అందుకు వేతనం కూడా నేటి వరకు చెల్లించలేదన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమర్లపూడి అప్పారావు, రామదాసు, ఆవుల అశోక్, శంకర్, నానయ్య, ఫణిరాజ్, సైదులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను పునరుద్ధించాలి

● మంత్రి తుమ్మలకు మహిళా రైతుల వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం/ ఖమ్మం స్పోర్ట్స్ జనవరి 12: ఇల్లెందు క్రాస్ రోడ్డులో గతంలో కొనసాగిన రైతు బజార్ ద్వారా రఘునాథపాలెం మండలానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో కూరగాయాల వ్యాపారం చేసుకొని కుటుంబ పోషణ చేశామని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పా టు చేసి రైతు బజార్‌ను తొలగించటంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తిరిగి కూరగాయల మార్కెట్‌ను పునరుద్ధరించాలని రఘునాథపాలేనికి చెందిన మహిళా రైతులు రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. శుక్రవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో తుమ్మలను కలిసిన మహిళా రైతులు తమ గోడును విన్నవించారు. దీంతో స్పందించిన తుమ్మల పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు.

వ్యవసాయకూలీలకు సమగ్ర చట్టం అమలు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి12: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు యర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, సంగయ్య, కేవీ రెడ్డి, రాధాకృష్ణ, వత్సవాయి జానకీరామ్, గద్దల రత్తయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాలపై అధికారులు దృష్టి సారించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 12: ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకముందే శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజాపంథా జిల్లా నాయకులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లా గ్రంథాలయానికి సెలవ్ రోజు కావటంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు శిదిలమైన భవనాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

నేడు సంగీత విభావరి

ఖమ్మం, సాంస్కృతికం, జనవరి 13: నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా స్వరమాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 గంటలకు సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదిరాజు పురుషోత్తమరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు గాయనీ గాయకులు పలు చిత్రాల్లోని పాటలను పాడి అలరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఖమ్మం, సాంస్కృతికం, జనవరి 13: మామిళ్లగూడెంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మామిళ్లగూడెంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ దుద్దుకూరి ఉషవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

తల్లాడ, జనవరి 12: తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో శుక్రవారం లయన్స్‌క్లబ్, విప్రో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు వేమిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి, కర్నాటి లక్ష్మారెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, నంబూరి కనకదుర్గప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఖమ్మం రూరల్, జనవరి 12: మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలోని మిరప తోటలను రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. మిర్చీ తోటకు వచ్చిన తెగుళ్లు, చీడ పురుగులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త టి. సురేష్‌రావు, కేవీకే శాస్త్రవత్తే రవికుమార్, ఉద్యానవన శాఖ డీడీ వేణుగోపాల్, వ్యవసాయశాఖ డీడీ మోహన్‌రెడ్డి, ఏడీఏ విజయచంద్ర, ఉద్యాన వన అధికారి అపర్ణ, ఏఓ నాగేశ్వరరావు, ఏఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లపాడులో క్రీడా పోటీలు ప్రారంభం

బోనకల్, జనవరి 12: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో శుక్రవారం 'అమ్మ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది మండలాల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ పున్నం చందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పారా శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల పాపారావు, పారా వెంకట మోహన్‌రావు, బుంగా రాము లు, తోటకూర వెంకటేశ్వరావు, మలాది లింగయ్య, మరీదు నాగభూషణం, వేల్పుల రమేష్, మరీదు ప్రసాద్, మరీదు వెంకట్రావు, చిన ముత్యాలు, నరేష్ పాల్గొన్నారు.

మధుకాన్ ఉద్యోగి హఠాన్మరణం

నేలకొండపల్లి, జనవరి 12: మండల పరిధిలోని మధుకాన్ షుగర్స్‌లో పని చేస్తున్న నేలకొండపల్లికి చెందిన ఏటుకూరి ముత్యాలరావు(38)శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. వివరాల ప్రకారం ముత్యాలరావు మధుకాన్ షుగర్స్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం విధుల్లో ఉన్న సమయంలో గుండెలో మంటగా అనిపించటంతో నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చాడు. వైద్యులు పరీక్షించేలోగానే కుప్పకూలి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి ఏటుకూరి వెంకటనారాయణ(గ్యాస్ వెంకటనారాయణగా ప్రసిద్ధి)కు మృతుడు ఒక్కడే కుమారుడు. మధుకాన్ జీఎం కోటయ్య, కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, సీపీఐ తదితర నాయకులు నివాళులర్పించారు.

పట్టభద్రుల ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

బోనకల్, జనవరి 12: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లకు సంబంధించి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కు కోసం వచ్చే నెల 6వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్ విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అఖిలపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 2020 నవంబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటుకు దరఖాస్తు చేసుకునే విదంగా చూడాలని కోరారు.

పెనుబల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు పొందేందుకు పట్టభద్రులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గంటా ప్రతాప్ సూచించారు. సమావేశంలో గిర్దావర్‌లు ఎండీ అక్బర్, భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ గులాంమహ్మద్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 12: ఖమ్మంనగరంలోని ఐడీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమతులు కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ప్రకటించారు. ఐడీఏ ప్రాంతం, జయనగర్‌కాలనీ, బాలపేట, బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కైకొండాయిగూడెం, గణేష్‌టౌన్ షిప్, యూపీహెచ్ కాలనీ, బాలాజీనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.